క్లుప్తంగా

ఘనంగా వరుణ యాగం



బిందెలతో నీళ్లు తెస్తున్న మహిళలు

చాగలమర్రి: వర్షం కురిసి పంటలు సమృద్ధిగా పండాలని మండల కేంద్రం సమీపంలో వెలసిన బుగ్గమల్లేశ్వరస్వామికి మండల ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ దుకాణాల అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం వరుణ యాగం నిర్వహించారు. వేదపండితులు ఓ. కిషోర్‌శర్మ, ఫణిశర్మ, యజ్వశర్మ ఆధ్వర్యంలో శివలింగానికి 108 బిందెలతో జలాభిషేకం చేశారు. అనంతరం ఆలయ మండపంలో స్వామివారికి సులోచన హోమం, రుద్ర హోమం, వరుణ హోమం జరిపించారు. ముఖ్య అతిథిగా ఆళ్లగడ్డ ఏడీఏ రామ్మోహన్ రెడ్డి, ఏఓ రంగ నేతాజి పాల్గొన్నారు.

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నంద్యాల(సిటీ): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్‌మాబున్నిసా తెలిపారు. బుధవారం పట్టణంలోని కూరగాయల మార్కెట్‌ను కమిషనర్ రవిచంద్రారెడ్డితో కలిసి పరిశీలించారు. భారీ వర్షానికి మార్కెట్‌లోని దుకాణం వరండా కూలిన విషయంపై ఆరా తీశారు. నిర్మాణాల్లో ఉన్న బ్రిడ్జిలు, కల్వర్టులు, మ్యాన్‌హోల్‌ల వద్ద సూచికలు ఏర్పాటు చేయాలని చెప్పారు. కలుషిత నీరు సరఫరా కాకుండా, వీధుల్లో విద్యుత్ దీపాలు వెలిగేలా ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కౌన్సిలర్లు అబ్దుల్ మజీద్, షేక్ సాదిక్ బాషా, కలాంబాషా ఉన్నారు.

వైభవంగా స్వాతి వేడుకలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని తెలుగుపేటలో వెలసిన శ్రీమద్దిలేటి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో బుధవారం స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే స్వామి వారికి పంచామృతాభిషేకం, స్నపన తిరుమంజన సేవ అనంతరం పట్టువస్త్రాలతో అలంకరించారు. అలాగే.. లక్ష్మీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు.

పారిశుద్ధ్యానికి ప్రాధాన్యతనివ్వండి

నంద్యాల(అర్బన్): వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో ప్రజలు అనారోగ్యాల పాలు కాకుండా పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ సుగుణశ్రీ తెలిపారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఎంపీపీ ప్రభాకర్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పంచాయతీలకు విడుదలైన నిధుల్లో పారిశుధ్యం, ఆరోగ్యం, తాగునీటికి ప్రాధాన్యతను ఇవ్వాలని సూచించారు. గ్రామస్తులు జ్వరాల బారిన పడకుండా పంచాయతీ సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. వైస్ ఎంపీపీ రంగారావు, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పించండి



రైతుతో మాట్లాడుతున్న భవాని

చాగలమర్రి: ఉపాధి హామీ పథకం కింద మునగ సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ ప్లాంటేషన్ డిప్యూటీ కమిషనర్ భవాని సూచించారు. బుధవారం ముత్యాలపాడు గ్రామంలో పథకం కింద సాగవుతున్న పండ్ల తోటలను పరిశీలించారు. జామ, మల్లెపూల తోటలను పరిశీలించి రైతులతో మాట్లాడి సాగులో తీసుకుంటున్న జాగ్రత్తలు, చర్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లకు ఇరువైపులా, ప్రభుత్వ పాఠశాలలో ప్రాంగణాల్లో మొక్కలు నాటి పెంచాలని సిబ్బందిని ఆదేశించారు. ముత్యాలపాడు, చిన్న భోదనం గ్రామాల్లో అమృత్ సరోవర్ పథకం కింద చేపట్టిన మొక్కల పెంపకంపై ఆరా తీశారు. డ్వామా పీడీ రామచంద్రారెడ్డి, ఏపీడీ సాంబశివరావు, సూపర్‌వైజర్ రషీద్, ఏపీఓ నిర్మలాదేవి, ఫీల్డ్ టెక్నికల్ అసిస్టెంట్లు, రైతులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో చిన్న సరిగెత్తు

నంద్యాల(వ్యవసాయం): హిందూ ముస్లిం మత సామరస్యానికి ప్రతీకగా నిర్వహించే పీర్ల పండుగను పురస్కరించుకొని బుధవారం పట్టణంలో చిన్న సరిగెత్తును భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు.నీలివీధిలో వెలసిన బీబీఫాతిమా, గాంధీచౌక్‌లో వెలసిన హుసేన్‌ఆలం, జుమ్మా మసీదు వద్ద వెలసిన ఇమామ్ హుసేన్ చిన్న సరిగెత్తులో భాగంగా పీర్లకు ప్రత్యేకంగా తయారు చేసిన పూలమాలలు, తమలపాకుల దండలు, బాసికాలు, దట్టీలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి పట్టణంలో గ్రామోత్సవం నిర్వహించారు.

కొలువుదీరిన పీర్లు

ఉయ్యాలవాడ : మొహర్రం సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లోని చావిళ్లల్లో పీర్లను బుధవారం కొలువుంచారు. మండల కేంద్రంలో మూడు చోట్ల, మాయలూరు, ఆర్.పాంపల్లె, రూపనగుడి, పడిగేపాడు, నర్సిపల్లె, అల్లూరు, తదితర గ్రామాల్లో వేడుకల కోసం పీర్ల చావిళ్లను ముస్తాబు చేశారు. బుధవారం రాత్రి చిన్నసరిగెత్తుతో ప్రారంభమై, 27న మధ్య సరిగెత్తు, 28న పెద్ద సరిగెత్తు, 29వ తేదీన పీర్లను ఊరేగింపుగా తీసుకెళ్లి కుందూ నదిలో నిమజ్జనం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

దొర్నిపాడు: మతసామరస్యానికి ప్రతీకగా జరుపుకునే మొహర్రం వేడుకల్లో భాగంగా చావిళ్లలో కొలువైన పీర్లకు బుధవారం భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు సర్పంచారు. క్రిష్టిపాడు, చాకరాజువేముల, దొర్నిపాడు, బుర్రారెడ్డిపల్లె, డబ్ల్యూ గోవిందిన్నె, డబ్ల్యూ.కొత్తపల్లె, గుండుపాపల తదితర గ్రామాల్లో మొహర్రం పూజలను ఘనంగా నిర్వహిస్తారు.



రుద్రవరంలో ప్లాస్టిక్ కవర్ కప్పుకొని బడికి వెళ్తున్న బాలిక



ఉయ్యాలవాడ సమీపంలో పచ్చగా మినుము పంట



రుద్రవరం సమీపంలో రోడ్డుకు అడ్డంగా

వర్షం..హర్షం



రెడ్డిపల్లె సమీపంలో మొక్కజొన్న పంటలో నిలిచిన వర్షపు నీరు





సంజీవనీ నర్సింగ్ హోం వద్ద నిలిచిన వర్షపునీరు,గోవిందపల్లె అండర్ పాస్‌వేలో నిలిచిన వర్షపు నీరు

నంద్యాల(అర్బన్): బంగాళఖాతంలో ఏర్పడ్డ వాయుగుండం ప్రభావంతో నంద్యాల నియోజకవర్గంలో భారీ వర్షం కురిసింది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు ఏకధాటిగా వర్షం కురవడంతో వంకలు, వాగులు, పొంగిపొర్లాయి. నంద్యాలలో 32.8మి.మీ వర్షపాతం నమోదు కాగా.. గోస్పాడు మండలంలో 34.2 మి.మీ వర్షం కురిసింది. మొత్తం మీద నియోజకవర్గంలో 67.0 మి.మీ వర్షపాతం నమోదైంది. ఖరీఫ్ సాగుకు వర్షం ఆలస్యమైందనుకుంటున్న అన్నదాతలకు వర్షం రాకతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షం కారణంలో పట్టంలోని పలుచోట్ల వర్షపునీరు రహదారులపైకి చేరడంతో వాహనదారులు, స్థానికులు ఇబ్బందులుబ పడ్డారు.

రుద్రవరం: కొద్దిరోజులుగా అడపాదడపా చినుకులతో సరిపెట్టుకోగా.. బుధవారం భారీ వర్షం కురిసింది. ఇటీవల కురిసిన వర్షాల్లో ఇదే పెద్దదని రైతులు పేర్కొంటున్నారు. ఈ వర్షంతో ఇప్పటికే సాగు చేసిన మొక్కజొన్న, మినుము, పత్తి వంటి పంటకు ఊపిరి పోసినట్లయ్యింది. మండలంలోని పలు గ్రామాల కాలనీలు జలమయమయ్యాయి. పంట పొలాల్లో వర్షపు నీరు నిలిచింది. వర్షం ధాటికి రుద్రవరం సమీపంలో పెద్ద వృక్షం రోడ్డుకు అడ్డంగా కూలిపోవడంతో కొద్దిసేపు రాకపోకలకు అంతరాయం కలిగింది.

ఉయ్యాలవాడ : తుపాన్ ప్రభావంతో మండలంలో వారం రోజులుగా మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. జూన్ నెలలో సాధారణ వర్షపాతం 63 మి.మీ., కాగా 67.8 మి.మీ., నమోదైంది. జూలైలో 119 మి.మీ. కురవాల్సి ఉండగా నేటి వరకు కేవలం 64 మి.మీ. మాత్రమే కురిసింది. కొందరు రైతులు మినుము, పత్తి, మొక్కజొన్న వంటి వర్షాధార పంటలు సాగు చేశారు. కురుస్తున్న వర్షం పంటలకు ఊపిరి పోసింది.

శిరివెళ్ల: తుపాన్ ప్రభావంతో మండలంలో విస్తారంగా వర్షాలు పడ్డాయి. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు 2.44 సెం.మీ. వర్షపాతం నమోదైంది. కురిసిన వర్షం మినుము,మొక్కజొన్న, పెసర పంటలకు ప్రాణం పోసినట్లయ్యిందని రైతులు పేర్కొంటున్నారు.



టెక్కె మార్కెట్‌యార్డులో నిలిచిపోయిన వర్షపునీరు

ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

నంద్యాల(అర్బన్): కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విద్యుత్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఏపీ విద్యుత్ ఉద్యోగుల సంఘం నంద్యాల డివిజన్ అధ్యక్షుడు కృపావరం కోరారు. డైరెక్ట్ పేమెంట్, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. రాష్ట్ర జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన దశల వారి ఆందోళనలో భాగంగా బుధవారం స్థానిక జయంతి వెజ్‌వరల్డ్‌లో నంద్యాల డివిజన్ జేఏసీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈఈ(ఆపరేషన్) రమణారెడ్డి, ట్రాన్స్‌కో ఈఈ ప్రభాకర్, డీఈలు ఆంథోనిరాజు, నాగేశ్వరరావు, హుసేని, సుధాకర్, దేవపాల్ పాల్గొన్నారు.

ఓటరు సవరణకు సహకరించండి

చాగలమర్రి: మండలంలో ఓటర్ల నమోదు, తొలగింపు సర్వేలో అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని తహసీల్దారు సుభద్రమ్మ కోరారు. బుధవారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ తరపున ఎంపీపీ వీరభద్రుడు, కాంగ్రెస్ నుంచి మహబుబ్‌బాషా, జనసేన నుంచి గంగుల నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా విజయ్ దివస్



అమరవీరులకు నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ : కార్గిల్ యుద్ధంలో విజయం సాధించిన సందర్భంగా ఏటా జూలై 26న విజయ్ దివస్‌ను నిర్వహిస్తారు. ఇందులో భాగంగా నంద్యాల డివిజన్ ప్రైవేటు పాఠశాలల సంఘం అధ్యక్షుడు అమీర్‌బాషా ఆధ్వర్యంలో స్థానిక ప్రజ్ఞా పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో అమర వీరుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

సర్వే వెంటనే పూర్తి చేయాలి



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

గోస్పాడు: గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో సర్వేను వెంటనే పూర్తి చేయాలని నంద్యాల జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ తెలిపారు. స్థానిక సచివాలయాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ పరిధిలో 5 - 18 సంవత్సరాల వయసు గల బడి ఈడు పిల్లల స్థూల నమోదు నిష్పత్తి (గ్రాస్ ఎన్రోల్మెంట్ సర్వే) నమోదు వివరాలను వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్, వలంటీర్లను అడిగి తెలుసుకున్నారు. సచివాలయంలో రోజూ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. డీఈఓ సుధాకర్ రెడ్డి, ఎంపీడీఓ భాస్కర్, ఎంఈఓ అబ్దుల్ కరీం, ఇన్‌చార్జ్ తహసీల్దార్ విజయశేఖర్ పాల్గొన్నారు.

నేడు 'జగనన్న సురక్ష'

ఉయ్యాలవాడ : మండలంలోని కొండుపల్లె గ్రామంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రజలు సదస్సుకు హాజరై ప్రభుత్వం అందజేస్తున్న 11 రకాల ధ్రువ పత్రాలను ఉచితంగా పొందవచ్చని చెప్పారు.అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముగిసిన శిక్షణ తరగతులు

దొర్నిపాడు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా ఉపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. స్కూల్ కాంప్లెక్స్ కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక, యూపీ, ఉన్నత పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులకు కాంపిటిటీవ్ బేస్డ్ అసెస్‌మెంట్ పరీక్షలను ఎలా నిర్వహించాలి అనే అంశంపై వేర్వేరుగా నిర్వహించిన శిక్షణలో హెచ్‌ఎం శ్రీనివాసరావు ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం విద్యార్థులకు బోధిస్తున్న విధానాలపై ఉపాధ్యాయులతో చర్చించారు. శిక్షణ అనంతరం డ్యాక్యుమెంట్ తయారీపై వివరించారు.

పులులను సంరక్షించుకుందాం

ఆళ్లగడ్డ: పర్యావరణ పరిరక్షణ కోసం నల్లమలలో పులుల సంరక్షణకు కృషి చేయాల్సిన అవసరముందని అహోబిలం అటవీ అధికారి ముర్తుజావలి అన్నారు. అంతర్జాతీయ పులల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం అహోబిలం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పులుల సంరక్షణ - ప్రాముఖ్యతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జీవ వైవిధ్యానికి ప్రధాన కేంద్రంగా నిలుస్తున్న పులలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

నాటుసారా స్వాధీనం

ఆళ్లగడ్డ: అక్రమంగా నాటుసారా తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఆళ్లగడ్డ సెబ్ ఇన్‌స్పెక్టర్ చంద్రమణి తెలిపారు. రుద్రవరం మండల పరిధిలోని అహోబిలం రస్తాలో నాటుసారా తరలిస్తున్నారనే సమచారం మేరకు బుధవారం సిబ్బందితో వెళ్లి బాలస్వామి బాయి తండా సమీపంలో దాడులు చేసి మూడే గూగో నాయక్, చిన్న నరసింహనాయక్‌ను అదుపులోకి తీసుకుని వారి నుంచి 45 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నిందితులను ఆళ్లగడ్డ సెబ్ స్టేషన్‌కు తరలించి సారాను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు వివరించారు.

పేదల ప్రభుత్వానికి మద్దతు ఇవ్వండి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మాబున్నిసా, లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందిస్తున్న దృశ్యం

నంద్యాల(సిటీ): అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, పేదలకు అండగా నిలిచే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అండగా నిలిచి ఆదరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా కోరారు. బుధవారం స్థానిక 24వ వార్డులో కౌన్సిలర్ షేక్‌షెహనాజ్ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వార్డులో సుమారు 670 మందికి ధ్రువపత్రాలను అందజేశారు. వైస్ చైర్మన్ పాంశావలి, ఏపీఎస్పీడీసీఎల్ రాష్ట్ర డైరెక్టర్ శశికళారెడ్డి, కౌన్సిలర్ మేస చంద్రశేఖర్, నాయకులు రహంతుల్లా, సోమశేఖర్‌రెడ్డి, సాయిరాం రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, మెప్మా సీఎంఎం విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే..పట్టణ శివారులోని ఊడుమాల్పురంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు ఆధ్వర్యంలో నిర్వహించారు. 320 దరఖాస్తులు రాగా 306 మందికి ధ్రువపత్రాలు అందించారు. మాజీ సర్పంచ్ తిక్కారెడ్డి, మురళీధర్‌రెడ్డి, బొమ్మన భాస్కర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, మున్సిపల్ సిటీ ప్లానింగ్ అధికారి నరసింహ మూర్తి పాల్గొన్నారు.

దశాబ్దాల సమస్య పరిష్కారం..

గతంలో 24వ వార్డులోని ఎగువ ప్రాంతాలకు తాగునీరు అందేది కాదు. ఎన్నో దశాబ్దాలుగా ఇక్కడ నీటి సమస్య కొనసాగుతున్నా గత పాలకులు పట్టించుకోలేదు. అయితే ఎమ్మెల్యే శిల్పా రవి చొరవతో శాశ్వత పరిష్కారం చూపించారు. ప్రెజర్ పంప్‌లను అమర్చి పగటిపూట ప్రతి ఇంటికీ తాగునీరు ఇస్తున్నామన్నారు.

మురుగు సమస్యకు పరిష్కారం



టీ.లింగందిన్నెలో సీసీ రోడ్డుపై నిలిచిన మురుగు నీరు

రుద్రవరం: మండలంలోని ఆర్.నాగులవరం,టీ.లింగందిన్నె గ్రామాల్లో నెలకొన్న మురుగు నీటి సమస్య త్వరలో పరిష్కారం కానుంది. ఆర్.నాగులవరం గ్రామ సచివాలయ పరిధిలో మూడు రోజుల క్రితం ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించి ఆయా కాలనీల్లో తిరిగి ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా ఆర్.కొత్తపల్లెలో రోడ్డు సౌకర్యం లేక మురుగు నీరు ఇళ్ల మధ్యనే నిలిచిపోతుందని స్థానికులు తెలియజేశారు. స్పందించిన ఎమ్మెల్యే జీజీఎంపీ నిధులు వెచ్చించి రోడ్డు వేయించాలని అధికారులను ఆదేశించారు. అలాగే టీ.లింగందిన్నెలో సీసీ రోడ్డుపై మురుగు నీరు నిల్వ ఉండిపోతుందని, పరిష్కరించాలని కాలనీ కోరారు. మురుగు నీరు దిగువకు పారేలా సీసీరోడ్డుపై ఫ్లోరింగ్ వేయించాలని అధికారులను ఆదేశించారు. త్వరలో రెండు గ్రామాల్లో పనులు చేపట్టి మురుగు సమస్యను పరిష్కరిస్తామని అధికారులు బుధవారం తెలిపారు.

సబ్సిడీ మంజూరు చేయండి



సమస్యను పరిష్కరించాలని కార్యాలయంలోనే కుర్చున్న రైతులు

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు గ్రామానికి చెందిన కొందరు రైతులకు రెండేళ్లయినా ఉపాధి హామీ సబ్సిడీ మంజూరు కాలేదని వాపోయారు. బుధవారం స్థానిక ఉపాధి హామీ పథకం కార్యాలయంలో రైతులు ఖాదర్‌గాళ్ల పెద్ద గురప్పా, కురువ, సుబ్బారాయుడు, నడిపి దస్తగిరి, ఖాదర్‌వలి, గవిండ్లో గురప్పా, పుల్లన్న మాట్లాడుతూ.. సబ్సిడీ రాకపోవడంపై ఏపీఓ నిర్మలాదేవిని ఎంపీపీ వీరభద్రుడు ఎదుటే నిలదీశారు. రెండేళ్ల క్రితం జామ, మల్లెపూల పంటల సాగు చేశామని, తమకు రావలసిన పూర్తిస్థాయి సబ్సిడీ అందలేదన్నారు. పంటలకు సంబంధించి ఎరువుల, సేద్యపు బిల్లు, మొక్కల బిల్లులు, కూలీ పనులకు సంబంధించిన మస్టర్లు ఏపీఓకు అందజేశామని ఎందుకు మంజూరు కాలేదని ప్రశ్నించారు. సొంత సొమ్ము లక్షల రూపాయలు వెచ్చించి పంట సాగు చేస్తే ప్రస్తుతం పండీగ తెగులు సోకి తీవ్రంగా నష్టం వాటిల్లిందని వాపోయారు. తమ లాంటి వారు మండలంలో 32 మంది ఉన్నారని చెప్పారు. కాగా.. డిప్యూటీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లరాదని తమను బెదిరించిందని, అయినా ఇద్దరు రైతులు ఆమె దృష్టికి తీసుకెళ్లారన్నారు. ఈ విషయంపై డ్వామా ఏపీడీ సాంబశివరావును ఫోన్‌లో సంప్రదించగా ఆ రైతులకు సంబంధించి పీఎఫ్‌ఎంఎస్ ఐడి నమోదు చేయలేదని, డిప్యూటీ కమిషనర్‌తో మాట్లాడామని, ఉపాధి హామీ రాష్ట్ర కార్యాలయంలోని సాంకేతిక సిబ్బందితో మాట్లాడి ఐడి జనరేట్ చేయించి రైతులకు న్యాయం చేస్తామని చెప్పారు.



వర్షంలోనూ కుందూలో చేపల కోసం వల విసురుతున్న మత్స్యకారుడు

అయినా.. వేట తప్పదు



వలకు చిక్కిన వాలుగలను చూపుతున్న మత్స్యకారుడు పుల్లయ్య

దొర్నిపాడు: కుటుంబం గడవాలంటే ఎండైనా, వానైనా పని చేయాల్సిందేనంటున్నా మత్స్యకారులు. బుధవారం కోవెలకుంట్ల మండలం పొట్టిపాడు గ్రామానికి చెందిన మత్స్యకారుడు పెద్దపుల్లయ్య క్రిష్టిపాడు వంతెన సమీపంలోని కుందూ నదిలో జోరువానలోనూ చేపలు పడుతూ ఇలా కనిపించాడు. వానకు తడుస్తూనే వల విసురుతూ వేటను కొనసాగించాడు. మొత్తానికి పది కిలోల వరకు వాలుగలు, సాధారణ చేపలను పట్టుకున్నాడు. తన కష్టానికి ఫలితంగా వాలుగలు దొరికాయని వాలుగలు కిలో రూ.200, పక్కెలు రూ.100 విక్రయించుకుంటానంటూ వెళ్లిపోయాడు. వర్షంలో చేపలు నీటిలో తిరుగుతాయని, దీంతో వలలకు సులభంగా చిక్కుతాయని చెప్పాడు.

టీకాలు వేయించుకోని చిన్నారులను గుర్తించండి



టీకా శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ

నంద్యాల(అర్బన్): 5 సంవత్సరాలు లోపు వయస్సు ఉండి టీకాలు వేయించుకోని చిన్నారులను గుర్తించి క్రమం తప్పకుండా వారికి వ్యాధి నిరోధక టీకాలు వేయాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటరమణ ఆదేశించారు. బుధవారం మండలంలోని పుసులూరు గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మిషన్ ఇంద్ర ధనస్సు కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక టీకా శిబిరాన్ని పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేసి టీకాలు వేయించుకోని చిన్నారుల వివరాలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్య, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి టీకాలు వేయించుకోని చిన్నారులు, గర్భిణుల జాబితా తయారు చేసి వారికి ప్రత్యేక టీకాల శిబిరంలో టీకాలు వేయాలని చెప్పారు. మలేరియా, డెంగీ, దీర్ఘకాలిక దగ్గు కాలిక దగ్గు, జ్వరంతో ఇబ్బంది పడుతున్న వారిని గుర్తించి మెరుగైన చికిత్స అందించాలని సూచించారు.

హుండీ ఆదాయం లెక్కింపు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని శ్రీకాళికాంబ చంద్రశేఖర దేవస్థానం శ్రీబ్రహ్మనందీశ్వరస్వామి దేవస్థానంలో హుండీ కానుకల లెక్కింపును బుధవారం ఈఓ రామాంజనేయశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈఓ మాట్లాడుతూ రూ.8,49,313 ఆదాయం రాగా బ్రహ్మనందీశ్వర స్వామి దేవస్థానం ఆదాయం రూ.53,072 సమకూరిందని చెప్పారు. కాళికాంబ దేవస్థానానికి గత ఏడాది కంటే రూ.లక్షకు పైగా ఆదాయం లభించినట్లు తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి

దొర్నిపాడు: కురుస్తున్న వర్షాలకు చిన్న పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలని, సీజనల్ వ్యాధులు ప్రబలే అకాశముందని, అప్రమత్తంగా ఉండాలని డబ్ల్యూ.కొత్తపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ నాగసాయి బుధవారం సూచించారు. ఆయన మాట్లాడుతూ చిన్నారులు వర్షానికి తడకవకుండా గొడుగులు ఇచ్చి పాఠశాలకు పంపాలన్నారు. అలాగే కాచి వడగట్టిన నీరు తాగాలని చెప్పారు. ఇళ్ల సమీపంలో నీటి నిల్వలు లేకుండా చూసుకుంటే దోమలు వృద్ధి చెందవన్నారు. రాత్రి పూట దోమ తెరలు వినియోగించాలని సూచించారు.

సేవలు అభినందనీయం



విద్యార్థినికి విద్యా సామగ్రి అందజేస్తున్న ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

నంద్యాల(న్యూటౌన్): స్వచ్ఛంద సేవా సంస్థల పేదలకు చేస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా అన్నారు. బుధవారం శ్రీరామకృష్ణ ఆడిటోరియంలో శ్రీచైతన్య కళాభారతి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 41 మంది హెచ్‌ఐవీ పాజిటివ్ ముస్లిం విద్యార్థులకు పోషక విలువలు కలిగిన ఆహార ధాన్యాలు, విద్యాసామగ్రి అందజేశారు. కార్యక్రమంలో రామకృష్ణారెడ్డి, అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ శారదాబాయి, జిల్లా లెప్రసీ టీబీ అధికారి చంద్రశేఖర్, నేస్తం అధికారి సుధారాణి, ప్రసాద్, చైతన్య కళాభారతి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు విజయభాస్కర్, ప్రతినిధి వరలక్ష్మి పాల్గొన్నారు. అలాగే.. నంద్యాల ఫౌండేషన్ రువిరాల్లా స్పైన్ సహకారంతో మహానంది, నంద్యాల, శిరివెళ్ల, వెలుగోడు మండలాలకు చెందిన 17 మంది దివ్యాంగ విద్యార్థులకు ట్రైసైకిళ్లు అందజేశారు. అయూబ్, హైమావతి, పుష్పలత పాల్గొన్నారు.